
ప్రత్యేక హోదా అడగాలి
సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు
- 7లో

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఇసుక ఉచితం



ప్రభుత్వం కసరత్తు.. తగ్గనున్న ధరలు

తొలగనున్న కష్టాలు.. నిర్మాణ రంగానికి భారీ ఊరట

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

బంగారంలాంటి ఇసుక సోమవారం నుంచి అందరికీ ఉచితం కానుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తాము ఎన్నికల సమయంలో ప్రకటించినట్టుగా ఇసుకను ఉచితంగా ప్రజలకు అందజేయాలని తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగానే జిల్లాల వారీగా యంత్రాగాన్ని అప్రమత్తం చేసింది. ఉచిత ఇసుక సరఫరా విధి విధానాలపై సమీక్షిం చాల్సిందిగా ఆదేశించింది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాల్లో ఎక్కడెక్కడ ఇసుక నిల్వలు ఉన్నవి గుర్తించి, ఆ మేరకు ఉచిత ఇసుక రవాణాకున్న ఆటంకాలను పూర్తిగా పొడిగించాల్సిందిగా ఆదేశించారు. దీంతో ఇసుక కావాల్సిన వారు రవాణా చార్జీలు చెల్లిస్తే సరిపోతుంది. నిర్మాణ రంగానికి ఊరట లభించనుంది. వైసీపీ హయాంలో ఇసుక కోసం పడిన కష్టాలు తొలగిపోనున్నాయి. గతంలోనూ టీడీపీ కూటమి అధికారంలో ఉన్నప్పుడు ఉచిత ఇసుక అమలు చేశారు. అప్పట్లో లారీ ఇసుక రూ.10 వేలకు లభ్యమయ్యేది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణ రంగానికి చావు దెబ్బ తగిలింది. ఒక విధి, విధానం లేదు. ఉచిత ఇసుకను రద్దు చేశారు. కొత్త విధానం వచ్చే వరకు ఇసుక సరఫరా నిలిపివేశారు. కార్మికులు రోడ్డున పడ్డారు. నిర్మాణ రంగం పూర్తిగా నిలిచిపోయింది. తర్వాత కరోనా మహమ్మారి వెంటాడింది. నిర్మాణ రంగానికి ఇది అవరోధంగా మారింది. ప్రభుత్వమే కొన్నాళ్లపాటు ఇసుక విక్రయించింది. ఆ సమయంలో వైసీపీ నేతలు దోచుకున్నారు. లారీ ఇసుక రూ.18 వేల వరకు విక్రయాలు సాగించారు. వైసీపీ నేతల గుప్పిట్లో ర్యాంపులు నడిచాయి. ఆ తర్వాత ర్యాంప్‌లను ప్రైవేటు ఏజెన్సీకి వైసీపీ ప్రభుత్వం అప్పగించింది. అప్పుడు ఇసుక ధరలు దిగిరాలేదు. లారీ ఇసుక రూ.14 వేలకు అమ్మకాలు సాగించారు. ఇసుక విరివిగా లభ్యమైంది. ధరలు మాత్రం దిగి రాలేదు. ఉచిత ఇసుక వల్ల ధరలు తగ్గు ముఖం పట్టనున్నాయి. రవాణా ఛార్జీలు కలుపుకుని సగటున రూ.10 వేలకు లారీ ఇసుక వచ్చే అవకాశం ఉంది.

గతంలో ఉచితం ఇలా..

టీడీపీ కూటమి గతంలో అధికారంలో ఉన్నప్పుడు తవ్వకానికి ధర నిర్ణయించారు. దీనిపై రవాణా ఛార్జీలు వేసుకుని ఇసుక విక్రయించేవారు. అప్పట్లోనూ దళారులు కొంత మేర ర్యాంపుల్లో పాగా వేశారు. దీనిని అరికట్టేందుకు తెలుగుదేశం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసింది. దీనివల్ల తక్కువ ధరకే అంటే రూ.10 వేలకు ఇసుక లారీ లభ్యమయ్యేది. అదే తక్కువ దూరంలో ర్యాంప్‌లు ఉంటే కేవలం రూ.8 వేలకే సరఫరా చేసేవారు. నిర్మాణ రంగం మంచి జోరు మీద ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా నిర్మాణాలు దెబ్బతిన్నాయి. ఇసుక ధరలు పెరిగాయి. ఎన్నికల ముందు తెలుగుదేశం కూటమి ఉచితంగా ఇసుకను అందజేస్తామని హామీ ఇచ్చింది. దానిని నెరవేర్చేందుకు రంగం సిద్ధం చేసింది. ఇదే నెలలో ఉచితం అమలులోకి రానుంది. దీనివల్ల తక్కువ ధరకే ఇసుక సరఫరా కానుంది.

కన్నేసిన దళారులు

తెలుగుదేశం కూటమి ఉచిత ఇసుక విధానానికి కసరత్తు చేస్తుంటే అప్పుడే దళారులు తయారయ్యారు. ఇప్పుడు కూడా ర్యాంపులను తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి తయారై పోతున్నారు. గతంలో ఇసుక రవాణాలో కీలకంగా వ్యవహరించిన వారే ఇప్పుడు ర్యాంపులపై దృష్టి పెట్టారన్న ప్రచారం సాగుతోంది. అదే జరిగితే ప్రభుత్వం అనుకున్న ధరకంటే మరింత ప్రియమయ్యే అవకాశం ఉంది. దీనిపైనే ప్రభుత్వం దృష్టి పెట్టాలి. ఎవరికైనా ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలి. లేదంటే కొందరు గుప్పెట్లో ర్యాంపులు ఉంటే ధరలు పెంచే అవకాశం లేకపోలేదు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం దళారులను దూరంగా పెట్టాలి. అప్పుడే ఉచిత ఇసుక విధానం సవ్యంగా సాగుతుంది.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఉచిత ఇసుక పాలసీ అమలుకు చర్యలు

» అధికారుల సమీక్షలో కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, జూలై 6 : జిల్లాలో ఉచిత ఇసుక పాలసీ అమలుకు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సి.నాగరాణి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖల అధికారులతో నూతన ఇసుక పాలసీ అమలుపై సమీక్షించారు. 'ప్రభుత్వం ప్రజలకు ఇసుకను ఉచితంగా అందించేందుకు నూతన ఇసుక పాలసీని ప్రవేశపెట్టడం జరిగింది. నూతన పాలసీ విధి విధానాలను సంబంధిత అధికారులు పూర్తిగా అవగాహన చేసుకుని, అవసరమైన చర్యలను చేపట్టాలి. జిల్లాలో ఆరు ఓపెన్ రీచ్‌లు ఆచంట మండలంలో కరుగోరుమిల్లి, కోడేరు, పెనుగొండ మండలంలో సిద్ధాంతం - 1, 2, నడిపూడి-1, 2 ఉన్నాయి. అబ్బిరాజుపాలెం, మాధవాయిపాలెం, యలమంచిలి లంక, దొడ్డిపట్ల, చించినాడలలో డీసిల్టేషన్ పాయింట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఏ ఒక్క పాయింట్‌లోను ఆపరేషన్ జరగడం లేదు. ఆరు ఇసుక స్టాక్ యార్డ్స్ భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు, సిద్ధాంతం, కొడమంచిలిలో ఉన్నాయి. ఇసుక తవ్వకాలకు అవసరమైన అనుమతులను పొందాల్సి ఉంది. ఇందుకు సంబంధించి గోదావరి హెడ్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ద్వారా అనుమతులకు ప్రతిపాదనలను సమర్పించాలి. అన్ని డీసిల్టేషన్ పాయింట్లకు గోదావరి హెడ్‌వర్క్స్ ఈఈ కాశీ విశ్వేశ్వరరావును కస్టోడియన్ అధికారిగా నియమించాం. గుర్తింపు పొందిన బోట్స్‌మెన్ సొసైటీల జాబితా సిద్ధంగా ఉంచాలి. థర్డ్ ఆర్డర్ స్ట్రీమ్‌లకు పంచాయతీ కార్యదర్శులను కస్టోడియన్‌గా నియమించడానికి చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం వున్న ఐదు డీసిల్టేషన్ పాయింట్లతోపాటు, అనువుగా ఉన్న మరికొన్నింటిని గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలి' అని సూచించారు. ఆరు స్టాక్ పాయింట్లకు కస్టోడియన్ అధికారులుగా పోలీస్, రెవెన్యూ అధికారులను నియమించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



ప్రముఖులను సత్కరిస్తున్న కేంద్ర మంత్రి వర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల, అంగర

అద్దేపల్లి సేవలు స్ఫూర్తిదాయకం : కేంద్ర మంత్రి వర్మ

పాలకొల్లు టౌన్, జూలై 6 : పాలకొల్లు చరిత్రలో స్వాతంత్ర సమరయోధుడు, విద్యాదాత, నిస్వార్థ ప్రజా సేవకుడు స్వర్గీయ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి దాతృత్వ సేవలు స్ఫూర్తిదాయకమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ అన్నారు. పాలకొల్లులోని శనివారం ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అద్దేపల్లి జయంతి ఉత్సవ సభలో ఆయన మాట్లాడారు. అద్దేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ నాడు ఇంటర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటుచేసి పాలకొల్లు పరిసర ప్రాంతాలకు చెందిన ఎంతో మంది విద్యార్థులకు విద్యాదాతగా నిలిచి వారి భవిష్యత్తును తీర్చిదిద్దిన అద్దేపల్లి అందరికీ ఆదర్శప్రాయుడన్నారు. ఆయన జయంతి ఉత్సవాలను ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏడాదిపాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆర్య వైశ్య ప్రముఖులను మంత్రులు సత్కరించారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ యర్రంశెట్టి పద్మారావు, జక్కంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాధవాయిపాలెం రేవు పాట రద్దు

నరసాపురం, జూలై 6 : మాధవాయిపాలెం రేవు పాట రద్దయ్యింది. షెడ్యూల్ ప్రకారం సోమవారం సాయంత్రం మూడు గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో పాట జరగాల్సి ఉంది. పాడేందుకు పాటదారులు ఎవరూ ఆసక్తి చూపలేదు. శనివారం నాటికి షెడ్యూల్ గడువు ముగిసింది. ఒక్కరూ కొనలేదు. ఈ కారణంగా పాటను రద్దు చేస్తున్నట్లు ఎంపీడీవో రమణరావు చెప్పారు. మళ్లీ పాటను ఎప్పుడు నిర్వహించేది అన్నది నోటిఫికేషన్ ఇస్తామన్నారు. పాట రద్దు కావడంపై పలు అనుమానాలు వినిపిస్తున్నాయి. ప్రారంభ ధరను రూ.3.61 కోట్లుగా నిర్ణయించారు. ఈ మొత్తానికి పాట పాడితే నష్టాన్ని మూట గట్టుకోవాల్సి వస్తుందన్న భయంతోనే పాటదారులు ముందుకు రాలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరోవైపు కొంత మంది కాంట్రాక్టర్లు రేవుపై కన్నేశారు. మూడుసార్లు పాట రద్దయితే నిబంధనల ప్రకారం పాట ప్రారంభ ధరను తగ్గించి మళ్లీ టెండర్ పిలుస్తారు. అప్పుడు తక్కువ మొత్తంలో రేవును దక్కించుకోవచ్చున్న ఉద్దేశంతోనే పాటదారులు వెనకంజ వేశారన్న వాదనలు లేకపోలేదు. ప్రస్తుతం రేవు నిర్వహణ ప్రభుత్వం చేపడుతుంది. పాట ఖరారయ్యే వరకు ఇదే తంతు కొనసాగుతుంది.

తాడేపల్లిగూడెం టీడీఆర్ బాండ్‌లపై కమిటీ

భీమవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో టీడీఆర్ బాండ్‌ల అక్రమాలపై ప్రభుత్వం స్పందించింది. జిల్లా కలెక్టర్ నాగరాణి ఈ బాండ్‌ల వ్యవహారాన్ని నిగ్గు తేల్చేందుకు కమిటీ వేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. కమిటీలో సభ్యులుగా జిల్లా రిజిస్ట్రార్, మున్సిపల్ రీజనల్ డైరెక్టర్‌ను నియమించారు. తాడేపల్లిగూడెంలో టీడీఆర్ బాండ్‌ల జారీపై విచారణ జరిపి త్వరితగతిన నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.



వైసీపీలో వైరాగ్యం

» రాజకీయాలకు దూరమంటూ నాయకుల ప్రకటన.. మాజీలకు పార్టీ శ్రేణుల నుంచి చేదు అనుభవం

» కూటమి నేతలతో సంప్రదింపులు.. దరి చేరనివ్వని అధికార పార్టీల నేతలు



నర్సాపురంలో వైసీపీ నేతలు పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. కూటమి నేతలతో సంప్రదింపులు జరిపారు. వైసీపీలో కీలకంగా వ్యవహరించిన నేతలే ఇలా పక్కదారి చూస్తుండడంతో నియోజకవర్గ నేత సంప్రదింపులు జరిపారు. పార్టీని వీడొద్దంటూ ప్రాధేయపడ్డారు. అయినా నాయకులు తగ్గేదేలే అంటున్నారు.

తాడేపల్లిగూడెంలో పట్టణానికి ప్రాతినిధ్యం వహించిన నేత వేరొకరిని చూసుకోవాలని పార్టీ నాయకత్వానికి చెప్పేశారు. ఆర్థికంగా ఇబ్బందులున్నాయి. ఇక పార్టీకి సేవలు చేయలేను. రాజకీయాల్లో అంతా పోగొట్టుకున్నా. ఇప్పుడు బయటకు రాలేనంటూ స్పష్టం చేశారు. జువ్వల పాలెంలో మరో వైసీపీ నేత తాను రాజకీయాలను విరమిం చుకుంటున్నానని నియోజకవర్గ నాయకత్వానికి తెగేసి చెప్పేశారు. వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి ఉత్సవాలు నిర్వహించేందుకు ప్రణాళిక చేద్దామంటూ రావాలని పిలుపునిచ్చిన నియోజకవర్గ నేతకు ఇప్పుడు తమ పార్టీ శ్రేణుల నుంచి ఇటువంటి సమాధానాలే వస్తున్నాయి.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ శ్రేణుల్లో పూర్తి నైరాశ్యం అలముకుం ది. తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేకపోతున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో పలకరించేవారు కరువయ్యారు. భారీ ఓట్ల తేడాతో జిల్లాలో ఓటమి పాలు కావడంతో వైసీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. రాష్ట్ర నాయకత్వంతో పాటు, నియోజకవర్గ నేతలు కేడర్‌ను పట్టించుకోలేదు. సొంత ప్రయోజనాలు చూసుకున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రయోజనం లేకపోయింది. ఇప్పుడు అధికారాన్ని కోల్పోవలసి వచ్చింది. ఈ పరిస్థితుల్లో బయటకు వస్తే మరిన్ని ఇబ్బందులు తప్పవన్న ఆలోచనతో వైసీపీ శ్రేణులున్నాయి. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పుడు వైసీపీ శ్రేణులు కోలుకోలేకపోతున్నాయి. వైసీపీ నుంచి సర్పంచ్‌లు ఉన్నప్పటికీ వారి ప్రభుత్వం ఉన్నప్పుడే గౌరవం లేకుండా పోయింది. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ అంటూ జగన్ ముందడుగు వేశారు. పంచాయతీల ను పట్టించుకోలేదు. నిధులు లేవు, విధుల్లేవు. సర్పంచ్‌లుగా కనీస మర్యాదలేదు. ప్రజలు తమ వద్దకు రాలేదంటూ వైసీపీ సర్పంచ్‌లు మదనపడ్డారు. ఇప్పుడు ప్రభుత్వం మారిపోవడంతో మరింత చులకనయ్యామంటూ సర్పంచ్‌లు కుమిలిపోతున్నారు. కూటమి శ్రేణులు గ్రామాలు, పట్టణాల్లోనూ అప్రమత్తమయ్యాయి. పట్టు బిగించాయి. పనుల కోసం తమ పార్టీ నేతల వద్దకు వెళుతున్నారు. పనులు చేయించుకుంటున్నారు. అధికారుల వద్ద కూటమి మాటే చెల్లుబాటు అవుతోంది.

మాట మార్చిన అధికారులు

వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నియోజకవర్గ నాయకత్వం మాటే చెల్లుబాటు అయ్యేది. ఎన్నికల కోడ్ వచ్చినంత వరకు కూటమి శ్రేణుల పట్ల అధికార గణంలో వ్యతిరేక ప్రభావం ఉండేది. అలాగని వైసీపీ శ్రేణులకు పెద్దగా మన్నన ఉండేదికాదు. పూర్తిగా నియోజకవర్గ నాయకత్వం చేతుల్లోనే అధికారులు ఉండేవారు. వారి మాటకే విలువ ఉండేది. ఏ పని కావాలన్నా నియోజకవర్గ నేతల వద్దకు వెళ్లి వైసీపీ శ్రేణులు పనులు చేయించుకునేవారు. ప్రభుత్వం మారిపోవడంతో అధికారులు మాట మార్చారు. ఇప్పుడంతా కూటమి మాటే చెల్లుబాటు అవుతోంది. వైసీపీ శ్రేణులు గ్రామాల్లో కూటమి నాయకత్వాన్ని ఆశ్రయిస్తున్నారు. పనులు చేయించుకునే పరిస్థితిలో ఉన్నారు. అధికారులు, ప్రభుత్వం సిబ్బందిలోనూ ఇప్పుడు పంథా మారిపోవడంతో వైసీపీ శ్రేణులు మరింత నిరాశలో కూరుకుపోయాయి.

వెలవెలబోతున్న మాజీల శిబిరాలు

వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులంతా ఇప్పుడు మాజీలయ్యారు. వారి వద్దకు వైసీపీ శ్రేణులు వెళ్లడం లేదు. శిబిరాలన్నీ ఖాళీ అయిపోయాయి. ఎన్నికల ముందే కొందరు కూటమి పంచన చేరారు. ఉన్న వారంతా ఇప్పుడు పార్టీకి దూరంగా ఉన్నారు. నేతలకు ముఖం చూపడం లేదు. పిలుపు వచ్చినా దరి చేరడం లేదు. రాజకీయాలకు దూరంగా ఉంటామని చెప్పుకొస్తున్నారు.

కూటమి వేటుతో దిగులు

వైసీపీ హయాంలో నామినేటెడ్ పదవులు పొందిన వారు ప్రభుత్వం మారిపోవడంతో నైతికంగా రాజీనామా చేశారు. కొందరు రాజీనామాలు చేయకుండా పదవులతో వేలాడారు. వారి పదవులను రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సొసైటీల్లో త్రిసభ్య కమిటీలు, దేవదాయ కమిటీలు, మార్కెట్ కమిటీలు ఇలా రద్దు చేశారు. కార్పొరేషన్ పదవులు లేకుండా పోయాయి. ఇలా ఒక్కసారిగా పదవులు కోల్పోవడంతో వైసీపీలో మరింత కుంగుబాటు నెలకొంది. ఎన్నికలు లేకుండా ఐదేళ్లపాటు నామినేటెడ్ పదవుల్లో దర్జా ఒలకబోసిన వైసీపీ నాయకులు పదవులు కోల్పోయారు. ఈ మార్పు వైసీపీ శ్రేణులను మరింత కుంగదీశాయి. ఇలా జిల్లా అంతటా వైసీపీ శ్రేణుల్లో రాజకీయాలంటే వైరాగ్యధోరణి కనిపిస్తోంది.

గోదావరి పెరుగుతోంది



కోడేరు వద్ద నీట మునిగిన ఇసుక తిన్నెలు

పోలవరం/ఆచంట, జూలై 6 : పోలవరంలో గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పోలవరం ప్రాజెక్టు ఎగువన కొండవాగులు, గోదావరి ఉపనదులైన శబరి, మంజీర, ప్రాణహిత, సీలేరు నదుల జలాలు గోదావరిలో కలుస్తుండడం వల్ల నీటిమట్టం పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న గోదావరి జలాలను 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 26.470 మీటర్లు, దిగువన 16.480 మీటర్లు, ఎగువ కాపర్ డ్యాంకి ఎగువన 26.520 మీటర్లు, దిగువన 15.340 మీటర్లు నీటి మట్టం నమోదైనట్లు ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

పట్టిసీమలో 6,018 క్యూసెక్కుల విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 6,018 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు ఎత్తిపోతల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు శనివారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటి మట్టం 14.750 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 12 పంపులు 17 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెల నాలుగో తేదీ నుంచి ఐదో తేదీ వరకూ 0.8460 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

ఇసుక ర్యాంపులపై ప్రభావం

భారీ వర్షాల కారణంగా వరద నీరు గోదావరిలోకి వస్తుండటంతో కళకళలాడుతోంది. కోడేరు ఇసుక తిన్నెలు నీట మునిగాయి. కోడేరు వద్ద ఉన్న ఇసుక ర్యాంప్ నీట మునిగింది. ఇప్పటి నుంచి రానున్న రోజుల్లో గోదావరిలో నీరు వచ్చి వెళుతూ ఉంటుంది. దీంతో ఇసుక తవ్వకాలకు ఇబ్బంది కలుగుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వం ఉచిత ఇసుక పథకానికి శ్రీకారం చుట్టనుంది. అయితే ప్రస్తుతం గోదావరిలోకి నీరు వస్తుండటంతో ఇప్పట్లో ర్యాంప్‌లు ప్రారంభమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.

అక్కరకు రాని ఆర్బీకేలు

» వైసీపీ హయాంలో భవనాలు నిర్వీర్యం.. పనికిరాని కోట్ల విలువైన పరికరాలు

» రూ.56 కోట్లు వెచ్చించి నిర్మాణం.. సిబ్బంది జీతాలు అదనం

» ఐదేళ్లలో కాల్వల మరమ్మతులకు ఖర్చు పెట్టాల్సింది రూ.125 కోట్లు

» వెచ్చించిన మొత్తం రూ.20 కోట్లు



భీమవరం ఎడ్యుకేషన్, జూలై 6 : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే) అక్కరకు రాకుండాపోయాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు అలంకారప్రాయంగా మిగులుతున్నాయి. కేంద్రంలోని అధిక ధరలు కలిగిన పరికరాలు ఉపయోగకరం కానివిగా మూలన పడుతున్నాయి. అధిక సేవలంటూ రైతులకు సహకరించక పోగా కొత్త నిబంధనలతో రైతులలో గందరగోళానికి గురయ్యేలా చేసింది. జిల్లాలో క్లస్టర్ల వారీగా ఆర్‌బీకేలను ఆదిలో అద్దె భవనాలలో ఏర్పాటు చేసినా, రైతులకు వాటి ద్వారా సాగులో సహకారం అందేలా చేయడంలో ప్రాధాన్యత ఇవ్వలేదు. భవనాల నిర్మాణం వాటిలో పనిముట్లు ఏర్పాటుపైనే దృష్టి పెట్టారు. దీంతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ఒక్కో ఆర్బీకే కేంద్రానికి రూ.21 లక్షల 50 వేలతో భవనాన్ని నిర్మించారు. జిల్లాలో 356 రైతు భరోసా కేంద్రాలలో రైతు భరోసా కేంద్రాలలో 75 శాతం భవనాలు సొంత భవనాలు సుమారు రూ.56 కోట్లతో నిర్మించారు. కొన్ని భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. ఆర్‌బీకేలతో రైతులకు అదనంగా ఒరిగిందేమి లేదని రైతులు ఇప్పటికే విమర్శిస్తున్నారు. దీనికితోడు ఆర్‌బీకేలలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ పనిముట్లు ఒక దానికి రూ.70 వేల వరకు వెచ్చించి ఏర్పాటుచేశారు. వాటిలో రైతులు ఎరువుల వివరాలు, ఇతర వివరాలు తెలుసుకోవచ్చని ప్రచారం చేశారు. మొత్తం మీద ఆ పరికరాలకు రూ.2 కోట్లుపైనే పెట్టినట్లయ్యింది. ఒక ఎరువుల విక్రయాలు తప్ప, అది కొన్ని రకాల ఎరువులు ఇచ్చే కేంద్రాలుగా నిలిచాయి. రైతులను ఆకట్టుకోలేదు. ఆర్‌బీకేల వల్ల విద్యుత్ బిల్లులు, సిబ్బంది జీతాలు ప్రభుత్వానికి భారం తప్ప రైతులకు నిరుపయోగమేనని రైతులు అంటున్నారు.

పరికరాలు మూలపడ్డాయి

ఆర్‌బీకేలలో వేల రూపాయలతో టెక్నాలజీ కలిగిన ఎలక్ట్రికల్ పరికరం పెట్టాం. పశువులకు సంబంధించిన దాణా, వ్యవసాయానికి కావాల్సిన ఎరువులు, రైతు భరోసా పథకం వివరాలు, విత్తనాలు ఎన్ని ఉన్నాయి తెలుసుకోవడం వంటివి చూడవచ్చని ఏర్పాటు చేశామన్నారు. రైతుకు వాటిని ఉపయోగించే విధానం తెలియదు. అవగాహన కల్పించలేదు. చివరికి ఆ పరికరాలు మూలనపడ్డాయి.



రైతు భరోసా కేంద్రం.. మూల పడిన వేల విలువైన పనిముట్లు

కాలువల అభివృద్ధికి సొమ్ము లేదు

జిల్లాలో వైసీపీ ప్రభుత్వం ఆర్‌బీకేల ఏర్పాటుకు భవనాలు, పరికరాలు కింద రూ.60 కోట్లు వెచ్చించింది. దీనికి సిబ్బంది జీతాలు అదనం. కాల్వల అభివృద్ధికి ఏడాదికి రూ.25 కోట్ల చొప్పున ఐదేళ్లల్లో రూ.125 కోట్ల వరకు ఖర్చు పెట్టాల్సి వుంది. కాని, ఈ ఐదేళ్లలో రూ.20 కోట్లు మించి ఖర్చు పెట్టలేదు. ఇదే రైతులపాలిట శాపంగా మారింది.

పెంపుడు కుక్కలకు టీకాలు



పమేరియన్ బ్రీడ్.. పేరు సాయి స్నూఫి



ల్యాబ్ జాతి పేరు చార్లి



సిల్కి.. పేరు చింటు



గోల్డెన్ రిట్రీవర్ జాతి.. పేరు రోలెక్స్

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉచితంగా వ్యాక్సిన్



రాట్‌వైలర్ జాతి.. పేరు లియో

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వెటర్నరీ ఆసుపత్రుల వద్ద పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రాబిస్ టీకాలు శనివారం వేశారు. ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్తలు తీసుకుని ఏడాదికి ఒక్కసారి రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని ఆయా జిల్లాల వెటర్నరీ అధికారులు సూచించారు. ఏలూరులో ఉచిత వ్యాక్సిన్ వేయించేందుకు కుక్కలను తీసుకొచ్చిన వాటి యజమానుల దృశ్యాలు.

- ఏలూరుటూటౌన్



అత్తిలి పశువైద్యశాలలో..



పమేరన్ జాతి.. పేరు జిమ్మి

చెస్ ఆర్బిటర్ నార్మ్ సాధించడం ఆనందంగా ఉంది

» జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్



ఎం. కిషోర్

భీమవరం అర్బన్, జూలై 6: ఇంటర్నేషనల్ చెస్ ఆర్బిటర్ నార్మ్ సాధించడం ఆనందగా ఉందని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. ఈ ఫీట్‌ను సాధించిన మొదటి జిల్లా వాసిగా రికార్డు సాధించారు. ఇప్పటికే ప్రపంచ చదరంగ సమాఖ్య నుంచి ఫిడే ఆర్బిటర్‌గా వ్యవహరిస్తున్నారు. గత నెలలో భీమవరంలో జరిగిన ఇంటర్నేషనల్ ఫైడ్ రేటింగ్ టోర్నమెంట్‌లో ఆర్బిటర్‌గా వ్యవహరించిన కిషోర్ మొదటి ఇంటర్నేషనల్ ఆర్బిటర్ నార్మ్ సాధించినట్టు తెలిపారు. భవిష్యత్తులో గ్రాండ్ మాస్టర్ టోర్నమెంట్లో ఆర్బిటర్‌గా వ్యవహరించి నార్మ్ సాధించడమే లక్ష్యం అన్నారు.

కియా ఇండియాలో ఉద్యోగాలకు ఆహ్వానం

ఏలూరు అర్బన్, జూలై 6 : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిప్లమో, బీటెక్ చదివిన అభ్యర్థులకు కియా ఇండియా సంస్థలో శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు 2019-24లో డిప్లమో, బీటెక్ ఉత్తీర్ణత సాధించి, వయస్సు 18-25 ఏళ్లలోపు వున్నవారు అర్హులని వివరించారు. ఎంపికైన వారికి స్టయిఫండ్ ఇస్తారని, అనంతపురం జిల్లా పెనుకొండలోని కియా ఇండియాలో ఐదురోజుల శిక్షణ పూర్తి చేసిన అనంతరం ట్రైనీలుగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు కియా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ 76589 02296 నంబరులో సంప్రదించాలని కోరారు.

వ్యవసాయరంగానికి కేవీకేలు కీలకం

ఉండి, జూలై 6 : వ్యవసాయరంగంలో రైతులను బలోపేతం చేయడంలో కృషి విజ్ఞాన కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని ఉండి కేవీకే ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ మల్లికార్జునరావు అన్నారు. శనివారం ఉండి కేవీకేలో శాస్త్రవేత్తలు, రైతులతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కేవీకేను ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తయిందని, రైతుల భాగస్వామ్యంతో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దేశంలో మొట్టమొదటి కృషి విజ్ఞాన కేంద్రం 1974 మార్చి 21న పుదుచ్చేరిలో ఏర్పాటు చేశారని, ఇప్పటివరకు 731 కేవీకేలు ఏర్పాటు అయ్యాయన్నారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా స్వర్ణోత్సవ జ్యోతి యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ జ్యోతి రంపచోడవరం మండలం పందిరిమామిడి కేవీకే నుంచి ప్రారంభమై తాడేపల్లిగూడెంలోని వెంకట్రామన్నగూడెం చేరుకుంటుందన్నారు. అక్కడ నుంచి ఉండి మండలం కేవీకేకు ఆదివారం చేరుకుంటుదన్నారు. ఈనెల 8న కేవీకేలో వరి విత్తనోత్పత్తి చేస్తున్న రైతులకు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్నవారికి సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 9న వీరవాసరం మండలం మత్స్యపురిలో వరి, మత్స్య రైతులకు సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

కాల్వలోకి దూకిన యువతి.. కానరాని ఆచూకీ

ఉంగుటూరు, జూలై 6 : నారాయణపురం వంతెన వద్ద ఈనెల రెండో తేదీన ఓ యువతి ఏలూరు ప్రధాన కాల్వలో దూకగా ఇంతవరకు ఆచూకీ లభించలేదు. చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాలివి.. భీమవరానికి చెందిన పెచ్చెట్టి ఝాన్సీ (20) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరిగా ఉంటూ జీవితం మీద విరక్తి చెంది రెండో తేదీన నారాయణపురం వద్ద ఏలూరు కాల్వలో దూకగా ఆమె ఆచూకీ కోసం చేబ్రోలు పోలీసులు, నిడమర్రు సీఐ మోగంటి వెంకటసుభాష్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం ఫైర్ సిబ్బందితో గాలింపు జరిపినా ఆచూకీ లభించలేదు. దీనిపై ఎస్ఐ ఎ.మణికుమార్ మాట్లాడుతూ ఆమె ఆచూకీ లభ్యమయ్యేవరకు గాలింపు చర్యలు జరుపుతామన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ ఎల్‌వీ సాగర్‌పై దాడి

చర్చి గొడవలే కారణం.. దాడికి పాల్పడింది చర్చి కమిటీ సభ్యుడు

ఏలూరు క్రైం, జూలై 6: చర్చి గొడవల నేపథ్యంలో రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, ఏలూరు మండల డిప్యూటీ తహసీల్దార్ ఎల్‌వీ విద్యాసాగర్‌పై ఓవ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని వైద్యులకు, ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు విద్యాసాగర్ ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం వివరాలివి.. ఎల్‌వీ సాగర్ గత కొన్నేళ్ల నుంచి ఏలూరు అమీనాపేటలో ఉన్న లూథర్ చర్చి కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారు. ఇటీవల ఏలూరు విద్యానగర్‌కు చెందిన ఎల్లంకి సునీల్‌కుమార్ కూడా చర్చి కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నాడు. చర్చికి సంబంధించిన వాట్సాప్ గ్రూపులో విద్యాసాగర్‌ను అవమానపరిచే విధంగా మెస్సేజ్‌లను సునీల్‌కుమార్ పెడుతున్నాడు. ఈ నేపథ్యంలో దీటుగా ఆయన కూడా మెసేజ్‌లు పెట్టారు. చర్చిలో సునీల్‌కుమార్ వల్ల తగాదాలు ఏర్పడుతున్నాయని అతడిని కమిటీ నుంచి తొలగించాలంటూ చర్చి పాస్టర్ ఇర్మియాకు, బిషప్‌లకు కమిటీ వారికి సాగర్ ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో సాగర్‌పై కక్ష పెంచుకున్న సునీల్ కుమార్ దాడికి పాల్పడ్డాడు. శనివారం ఉదయం ఏలూరు ఇండోర్ స్టేడియంలో సాగర్ వాకింగ్‌కు వెళ్లి తిరిగి బయటకు వచ్చిన సమయంలో సునీల్‌కుమార్ కారులో మరో ముగ్గురు వ్యక్తులను తీసుకువచ్చి బెదిరింపు చూపులు చేశాడని అయితే అక్కడ ప్రజలు ఎక్కువ మంది ఉండడంతో వెళ్ళిపోయాడని చెప్పారు. చివరకు అశోక్‌నగర్‌లోని తన ఇంటి నుంచి ఆఫీసుకు వెళ్లే సమయంలో కారులో వచ్చిన సునీల్‌కుమార్ కత్తితో దాడికి ప్రయత్నించగా చేయి అడ్డు పెట్టుకోగా చేయి తెగిందని చర్చి గొడవల నేపథ్యంలో ఘర్షణకు దిగి దాడి చేశారాని వాంగ్మూలంలో పేర్కొన్నారు. అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం పొంది ఎమ్మెల్సీగా నమోదు చేశారు. ఔట్‌పోస్టు పేషెంటుగానే వైద్య సేవలు అందించారు.

శ్రీవారికి ఎంపీ పురందేశ్వరి దంపతుల పూజలు

ద్వారకాతిరుమల, జూలై 6 : ద్వారకాతిరుమలేశుని ఆలయాన్ని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి కుటుంబసమేతంగా సందర్శించారు. ఆలయానికి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుతో కలిసి వచ్చిన ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు దేవస్థానం మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. తొలుత ఆమె ఆలయంలోకి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖమండపంలో ఆమెకు, ఆమె భర్త వెంకటేశ్వరరావుకు, స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటికి అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందించారు. ఆలయ ట్రస్టీ ఎస్వీ నివృతరావు, ఈవో త్రినాథరావు వారికి స్వామివారి చిత్రపటాలు, ప్రసాదాలను అందజేశారు. కూటమి నేతలు లంకా సత్యనారాయణ, పోలిన శ్రీనివాసరావు, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, మొగతడకల శ్రీనివాసరావు, ఏపూరి దాలయ్య, డీవీఎస్ చౌదరి, నాదెళ్ల సురేంద్ర, పలువురు బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.



ఎంపీ పురందేశ్వరి దంపతులు, ఎమ్మెల్యే మద్దిపాటికి శ్రీవారి చిత్రపటాలను అందిస్తున్న ట్రస్టీ, ఈవోలు



భక్తుల రద్దీ →

భక్తులతో శ్రీవారి క్షేత్రం కళకళ

ఆషాఢమానం తొలిరోజు కావడంతో పాటు స్వామికి ఇష్టమైన రోజు కావడంతో చినవెంకన్న స్వామి క్షేత్రం శనివారం భక్తులతో కళకళలాడింది. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో నిండిపోయాయి. మధ్యాహ్నం సమయానికి భక్తుల సంఖ్య పెరగడంతో దాదాపు 15 వేల మంది వరకు ఆలయానికి వచ్చి మొక్కుబడులు తీర్చుకుని స్వామి, అమ్మవార్లను దర్శించినట్టు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

'వశిష్ఠ వారధి' నరసాపురం మీదుగా సాగాలి

» కేంద్ర మంత్రికి మాజీ ఎమ్మెల్యే బండారు విన్నపం



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు

నరసాపురం, జూలై 6: నరసాపురం మండలం రాజుల్లంక వద్ద ప్రతిపాదించిన వశిష్ఠ వారధి నిర్మాణ రూట్ మ్యాప్‌ను మార్చాలని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మకు శనివారం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు కోరారు. ఢిల్లీ కార్యాలయంలో ఆయనను కలిసి గత ప్రభుత్వ హయాంలో వారధి నిర్మాణ రూట్ మ్యాప్ మారిందన్నారు. గతంలో ఈ వారధిని శివకోడు నుంచి మల్కీపురం, నరసాపురం పట్టణం మీదుగా లాకుల వద్ద 216 జాతీయ రహదారి కలిసే విధంగా ప్రతిపాదించామన్నారు. రాష్ట్ర విభజన తరువాత అప్పటి కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. అయితే గత ప్రభుత్వం కోనసీమ జిల్లాలోని రామేశ్వరం, నరసాపురం మండలం రాజుల్లంక వద్ద వారధి నిర్మాణం జరిగేలా రూట్‌మ్యాప్‌ను ఖరారు చేసిందన్నారు. దీని వల్ల కోనసీమ జిల్లాలోకి వెళ్లాలంటే పట్టణం నుంచి ఏడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందన్నారు. ఇటు లంక వాసులు నరసాపురం రావాలంటే ఐదు కిలోమీటర్లు వెళ్లాలన్నారు. ఈ కారణంగా వారధి నిర్మించిన మాధవాయిపాలెం-సఖినేటిపల్లి పంటు మాత్రం యథావిధిగా తిరుగుతుందన్నారు. ఈ కారణాల దృష్ట్యా అక్కడ ప్రతిపాదించిన వంతెను రద్దు చేసి 2017లో కేంద్రం ఆమోదించిన విధంగానే వారధిని ఇసుక ర్యాంపు వద్ద నిర్మించాలని కోరారు. దీనికి మంత్రి వర్మ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

టి.నరసాపురం సొసైటీలో అవకతవకలపై విచారణ



బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

టి.నరసాపురం, జూలై 6 : టి.నరసాపురం సొసైటీలో ఉద్యోగులు అవకతవ కలకు పాల్పడ్డారనే అభియోగంపై డీసీసీబీకి అందిన ఫిర్యాదుపై ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ అధికారి అల్లంశెట్టి శాంతకుమారి శనివారం విచారణ నిర్వహించారు. ఈ మేరకు డిపాజిట్‌దారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఖాతాదారులకు సత్వరమే న్యాయం చేయాలని కోరుతూ విచారణ అధికారిణికి జనసేన మండల గ్రామ పంచాయతీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలేటి సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు.

వర్జీనియా పొగాకు రికార్డు ధర రూ.375



జంగారెడ్డిగూడెం, జూలై 6 :పొగాకు ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో రైతుల ముఖంలో ఆనందం వెల్లివిరుస్తుంది. శనివారం స్థానిక పొగాకు వేలం కేంద్రాల్లో కిలో పొగాకు ధర రూ.375కు చేరింది. రెండు రోజులుగా రూ.372 ధర నుంచి శనివారానికి రూ.375కు చేరిందని పట్టణంలోని రెండు వేలం కేంద్రాల అధికారులు నరేంద్ర కుమార్, శ్రీహరి తెలిపారు.

నేడు శ్రీవారి క్షేత్రానికి జగన్నాథుని రథం రాక

» లక్ష్మీపురంలో నేటి నుంచి 16వ తేదీ వరకు ఉత్సవాలు



ఉత్సవ నిర్వహణకు తెచ్చిన రథవాహనం

ద్వారకాతిరుమల, జూలై 6: జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా లక్ష్మీపురం ఆలయం నుంచి సుభద్రా బలభద్ర సమేత జగన్నాథుడు ఆదివారం సాయంత్రం రథయాత్రగా శ్రీవారి క్షేత్రానికి రానున్నారు. ఈ మేరకు శనివారం ఏర్పాట్లు చురుగ్గా జరుగుతు న్నాయి. ఏడాదికోసారి ఈవిధంగా జగన్నాథుడు క్షేత్రానికి రావడం సంప్రదాయం. ఈ నేపథ్యంలో ఇప్పటికే రథశాల నుంచి రథాన్ని ఉత్సవ నిర్వహణ నిమిత్తం బయటకు తెచ్చారు. ఉత్సవాల రోజుల్లో జగన్నాథుడు దశావతారాల్లో రోజుకో అలంకారంలో దర్శనమీయనున్నారు. ఈక్రమంలో మండపానికి చుట్టూ తెరలు కట్టిఆలయ సిబ్బంది సుందరీకరిస్తున్నారు. శ్రీవారి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథస్వామి ఆలయంలో ఆదివారం నుంచి ఉత్సవాలు ప్రారంభమై ఈనెల 16వ తేదీ వరకు జరుగుతాయి. ఆఖరి రోజైన ఈనెల 16వ తేదీన సమీప గ్రామం తిమ్మాపురానికి రథయాత్ర వెళ్లివస్తుంది. ఆలయం వద్ద ఏర్పాట్లు పూర్తయినట్టు ఈవో త్రినాథరావు తెలిపారు.





ఇంద్రప్రస్థం, మళ్లీ కలిసి జీవిద్దాం నాటికల్లో సన్నివేశాలు

కుటుంబ బంధాలు, బాధ్యతను తెలిపిన నాటికలు

ఏలూరు రూరల్, జూలై 6:ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో జరుగుతున్న అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్రస్థాయి నాటిక పోటీలు అలరిస్తున్నాయి. మూడోరోజు శనివారం సందేశంతో పాటు వినోదాన్ని అందిస్తూ నాటక రంగానికి పూర్వవైభవం తెచ్చే దిశగా వైఎంహెచ్ఏ, హేలాపురి కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలు జరుగుతున్నాయి. నటీనటులు తమ నటనతో ప్రేక్షక అభిమానులను కట్టిపడేశారు.

'మళ్లీ కలిసి జీవిద్దాం' నాటిక..

కుటుంబ బంధాలను గుర్తుచేస్తూ మళ్లీ కలిసి జీవిద్దాం నాటిక సందేశం ఇచ్చింది. సత్యనారాయణమూర్తి, లీలావతి దంపతులు వారి సంతానం చంద్రశేఖర్, గాయత్రితో ఎప్పుడో జరిగిన సంఘటన కారణంగా గ్రామంలోనే వేరేచోట ఒంటరిగా వండుకుని తింటూ ఉంటాడు సత్యనారాయణమూర్తి. భార్యకాలం చేసినా అతడి ఆలోచనలో మాత్రం ఆమె చనిపోలేదు. ప్రతి జ్ఞాపకాన్ని నెమరువేసుకుంటూ ఉంటాడు. జీవిత చరమాంకంలో భార్య లీలావతితో మళ్లీ కలిసి జీవించాలని, అతడి ఆశ. మనిషి ఆనందంగా బతకడానికి అనుభూతులు, జ్ఞాపకాలు ఎలా దోహదం చేస్తాయో చెప్పడమే మళ్లీ కలిసి జీవిద్దాం నాటిక చాటిచెప్పింది.

'ఇంద్రప్రస్థం' నాటిక..

అనంతరం అభినయ గుంటూరు వారిచే ఇంద్రప్రస్థం నాటిక ప్రదర్శించారు. ఈ నాటికలో కుటుంబ బాధ్యతలు మోసే తండ్రి గొప్పతనాన్ని ప్రతి కుమారుడు, కూతురు తెలుసుకోవాల్సిన అవసరం ఉందంటూ సందేశాత్మకంగా నాటిక ప్రదర్శన జరిగింది. కుటుంబాల్లో సభ్యుల మధ్య కనిపించే ప్రేమలు, హర్షించే విధంగా కనిపించాలే తప్ప అనాలోచితంగా పరిగెడితే జీవితం విలువలు నాశనం అవుతాయని, బాధ్యత కలిగిన తండ్రి ఉన్న కుటుంబాల్లోని ఇళ్లు ఇంద్రప్రస్థం మాదిరిగా వెలిగిపోతాయనే చక్కటి ఇతివృత్తంగా కళాకారులు నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో హేలాపురి కళాపరిషత్ అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ, కోటేశ్వరరావు, కేబీరావు, వైద్యులు ఎంఎల్‌వీ ప్రసాద్, మానవతా నాగేశ్వరరావు, లంకా వెంకటేశ్వర్లు, కాంతారావు, ఖాజావలీ, గుత్తా కౌసలేంద్రరావు, పురుషోత్తం తదితరులు పర్యవేక్షించారు.

బంగారం షాపుల్లో ఘరానా మోసాలు

పాలకొల్లులో బంగారం చోరీకి యత్నం

» పట్టుబడిన మహిళ.. పోలీసులకు అప్పగింత



షాపులో చోరీకి పాల్పడిన మహిళ

పాలకొల్లు అర్బన్, జూలై 6 : పాలకొల్లు పట్టణంలోని బంగారం షాపులో ఓ మహిళ చోరీకి యత్నించి పట్టుబడింది. స్థానిక శివాజీ జ్యూయలర్స్‌లో శనివారం సాయంత్రం ఓ మహిళ వచ్చి బంగారం ఆభరణాలు చూపించమని కోరింది. షాపు సిబ్బంది హడావుడిలో ఉండగా మహిళ కొన్ని నగలు కాజేసి వెళ్లిపోతుండగా సిబ్బంది అప్రమత్తమై పట్టుకున్నారు. ఆమెను నిర్బంధించి పట్టణ పోలీసులకు అప్పగించారు. ఆమెది విజయవాడ అని చెబుతున్నట్టు షాపు సిబ్బంది ద్వారా సమాచారం. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ పోలీసులు తెలిపారు.

» ఆకివీడులో నకిలీ ఆభరణాలు పెట్టి బంగారం చోరీ..



నగలను చూస్తున్న ఇద్దరు మహిళలు

ఆకివీడు, జూలై 6: బంగారం దుకాణంలో ఘరానా మోసం జరిగింది. ఆకివీడులో పొట్టి శ్రీరాముల విగ్రహం సమీపంలో వున్న శ్రావణి జ్యూయలరీ షాపులోకి ఈనెల 4న మధ్యాహ్నం ఇద్దరు మహిళలు బంగారం వస్తువులు కొనుగోలు చేసేందుకు వెళ్లి నగలు దొంగతనం చేశారు. నగలను చూస్తున్నట్టు నటించి వాటి స్థానంలో నకిలీ ఆభరణాలు పెట్టి బంగారాన్ని ఎత్తుకెళ్ళారు. మహిళలు వెళ్ళిపోయిన తరువాత షాపు యజమానికి అనుమానం రావడంతో దుకాణంలో ఉన్న నగలను పరిశీలించారు. నకిలీ ఆభరణాలుండడంతో కంగుతిన్నాడు. సుమారు రూ.2.40 లక్షల విలువైన నగలు ఎత్తుకెళ్ళారని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరాలు పరిశీలించిన అనంతరం ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని రంగాల్లో రాష్ట్రానికి అన్యాయం

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

నూజివీడు టౌన్, జూలై 6 : మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో రాష్ట్రానికి అన్ని రంగాల్లో తీవ్ర అన్యాయం చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నూజివీడు అమర్ భవన్‌లో రాష్ట్రస్థాయి మేధో మథన సమాలోచన కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'పదేళ్ల మోదీ పాలనలో ఏ ఒక్క సమస్య పరిష్కరించ లేదు. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో ఏ రాష్ట్రానికి లేని అవకాశం ఆంధ్రరాష్ట్రానికి ఉంది. టీడీపీ మద్దతు పార్లమెంట్‌లో, వైసీపీ మద్దతు రాజ్యసభలోనూ అవసరం ఉంది. రాష్ట్రంలో గొడవ పడుతున్న ఈ పార్టీల నాయకులు కేంద్రంలో మోదీకి సలామ్ కొడుతున్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత ఇరుపక్షాలపై ఉంది. కమ్యూనిష్టు పార్టీలు కార్మికుల పార్టీలుగా గుర్తింపు పడ్డాయి. కార్మికులు, ఉద్యోగులు మెరుగైన జీవితాలు సాగిస్తున్నారంటే దానికి కారణం కార్మిక సంఘాల కృషి కారణం. కార్మికవర్గం ఆర్థిక అంశాలు సాధించుకోవడానికి ఎర్రజెండా పడుతున్నారు. కాని అనంత రం పలు మార్గాలను ఎంచుకుంటున్నారు. సమాజంలో మార్పు రావాలన్నా దేశ రాజకీయాలు మారాలన్నా, కార్మికవర్గం కమ్యూనిష్టు పార్టీల వైపు ఉండా లి. రాష్ట్రంలో గత ఐదేళ్లు నియంత పాలన సాగింది. వ్యవస్థలు అన్ని కుప్ప కూలి రాష్ట్రం అప్పుల పాలైంది'.. అని విమర్శించారు. రాష్ట్ర ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావులపల్లి రవీంద్రనాథ్, జి.ఓబులేషు, రాష్ట్ర గౌరవఅధ్యక్షుడు వి.రాధాకృష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు, ఉప ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా అడగాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం నేత శ్రీనివాసరావు

భీమవరం అర్బన్, జూలై 6: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని అడిగే అవకాశం ఉన్నా ఎందుకు అడగడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. శనివారం పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం గత పదేళ్ల కంటే ఈ ఎన్నికల్లో ప్రజల మద్దతు తగ్గిందన్నారు. మిత్రుల సహకారంతో మోదీ అధికారంలోకి వచ్చారని గుర్తించాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడు అడుగుతారని ప్రశ్నించారు. గత ముఖ్యమంత్రిలా లొంగుబాటు తత్వంతో కాకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని నిలదీయాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో పెరిగిన నిత్యావసరాల ధరలు తగ్గేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కార్యదర్శి బి.బలరామ్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్లు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, కర్రి నాగేశ్వరరావు, పీవీ ప్రతాప్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యాన్ ఢీకొని ఒకరి మృతి

» మరో బాలుడికి గాయాలు

మొగల్తూరు, జూలై 6 : వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో బాలుడు తీవ్ర గాయాలైన ఘటన మొగల్తూరు మండలం కొత్తోట సమీపంలో శనివారం జరిగింది. మొగల్తూరు పోలీసులు తెలిపిన వివరాలివి.. కొత్తోట పంచాయతీ పరిధి చింతరేవు బ్రిడ్జి దిగువన బైక్‌ను ఎదురుగా వస్తును బొలెరో వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న భీమవరం మండలం దొంగపిండి గ్రామానికి చెందిన రేవు ఏసు(20) అక్కడికక్కడే మృతి చెందగా బైక్‌పై ఉన్న మరో బాలుడు తిరుమాని గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మొగల్తూరు ఎస్ఐ కె.వెంకట రమణ తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 6 : ప్రేమ వ్యవహారంలో పెళ్లికి పెద్దలు నిరాకరించడంతో మనస్తాపంతో శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. సీఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలివి.. నిడదవోలుకు చెందిన బాదంపూడి మమత (22)తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తుంది. కపిలేశ్వరపురానికి చెందిన తాతపూడి రాజేష్, ఆమె ఇద్దరూ ప్రేమించుకున్నారు. రాజేష్‌కు ముందే పెళ్లి కావడంతో వారి పెళ్లికి యువతి పెద్దలు ఒప్పుకోలేదు. మనస్తాపానికి గురైన యువతి తాను పనిచేస్తున్న ఆసుపత్రి క్వార్టర్స్ వద్ద వీడియో కాల్‌లో రాజేష్‌కు చెబుతూ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటికే ఆమె ఇంటికి చేరుకుని కాపాడే ప్రయత్నం చేయగా కొన ఊపిరితో కొట్టుకోవడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించిన విషయం విధితమే.. అక్కడ యువతి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

తాటిచెట్టు మీద పడి ఒకరి దుర్మరణం

లింగపాలెం, జూలై 6: లింగపాలెం మండలం బాదరాల గ్రామంలో తాటిచెట్టు మీదపడి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ధర్మాజీగూడెం ఎస్ఐ పి.చెన్నారావు తెలిపిన వివరాలివి.. మండలంలోని కె.గోకవరం గ్రామానికి చెందిన ముంజుల రాంబాబు (30) అనేవ్యక్తి బాదరాలలోని ఓ రైతు పొలంలో తాటిచెట్లు నరకడానికి వెళ్ళినట్టు తెలిపారు. ఆ చెట్టుపైకి ఎక్కి తాడుకడుతుండగా తాటిచెట్టు ఒక్కసారిగా కిందపడి రాంబాబు మీదపడి ఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఉండి, జూలై 6 : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఉండి ఏఎస్ఐ సుబ్బారావు తెలిపిన వివరాలివి.. ఉండి మండలం వాద్రం గ్రామానికి చెందిన కలపాల సింహాద్రి (42) గతనెల 27 తేదీన గ్రామంలో కూలి పనికి వెళ్లి చెట్టుఎక్కి నరుకుతుండగా ప్రమాదవశాత్తు చెట్టు మీదపడి తీవ్ర గాయాలపాల య్యాడన్నారు. వెంటనే ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం గుంటూరు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలు

చింతలపూడి, జూలై 6: ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన చింతలపూడి నగర పంచాయతీ ఏలూరు రోడ్డుపై ఆయిల్ మిల్లు వద్ద శనివారం జరిగింది. ఎస్ఐ కుటుంబరావు తెలిపిన వివరాలివి.. సమ్మెటవారిగూడెం గ్రామానికి చెందిన పల్నాటి చంటి అనే వ్యక్తి ఫోన్ మాట్లాడుతూ మోటారుసైకిల్ నడుపుతుండగా ఎదురుగా వస్తున్న మరో వాహనం ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. అతడిని చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స జరిపి మెరుగైన చికిత్స కోసం ఏలూరు తరలించినట్టు ఎస్ఐ కుటుంబరావు తెలిపారు.

శేషాచలంపై భక్తుడి బైక్ చోరీ

ద్వారకాతిరుమల, జూలై 6: శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి వచ్చిన ఓ భక్తుని బైక్ శనివారం చోరీకి గురైంది. మండవల్లి మండలం కొవ్వాడలంకకు చెందిన జయమంగళ శివనాగరాజు ఉదయం కుటుంబసమేతంగా స్వామివారి దర్శనం నిమిత్త తన బైక్‌పై ద్వారకాతిరుమలకు వచ్చాడు. పార్కింగ్ ప్రాంతంలో బైక్‌ను ఉంచి దర్శనానంతరం బయటకు వచ్చి చూసేసరికి బైక్ కన్పించలేదు. పరిసరాల్లో వెతికినా ఫలితం దక్కలేదు. దేవస్థానం సీసీ కెమెరాలను పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌ను చోరీ చేస్తున్న దృశ్యాలు కన్పించాయి. ఈ మేరకు బాధితుడు ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు.

కాల్వల్లో తూడు తొలగింపు పనులు

ఆకివీడు, జూలై 6:వెంకయ్య వయ్యేరు కాలువలో శనివారం కర్రనాచు, తూడు తొలగింపు పనులు చేపట్టారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ పణిశంకర్‌ను ప్రశ్నించగా పరిమళ లాకుల నుంచి ఏలూరుపాడు వరకూ వెంకయ్య వయ్యేరు, పాత ఏరులో గుర్రపుడెక్క, తూడు, కర్రనాచు తొలగించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో 72 గ్రామాల ప్రజలు, రైతులకు తాగు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడడంతో పాటు ముంపుబారిన పడకుండా చర్యలు చేపట్టామన్నారు.

మంత్రులను కలసిన బంగారయ్య



ఆకివీడు, జూలై 6: వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలంటూ కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి వై.సత్యకుమార్ యాదవ్‌లను శనివారం విజయవాడలో వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర సహాధ్యక్షుడు బంగారయ్య విజ్ఞప్తి చేశారు. వినియోగదారుల సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్ళినట్లు మీడియాకు ఆయన చెప్పారు.

పల్లపు ప్రాంతాలు మునక



పాలకొల్లులో మునిగిన రోడ్డు

ఆచంట, జూలై 6: గత కొన్ని రోజులుగా వాతావరణం మబ్బులు, మేఘాలతో నిండి ఉంటుంది. అప్పుడప్పుడు వానలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిండి ఉంటుంది. ఇటీవల మట్టి తోలకాలు ఎక్కువగా జరగడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కారణంగా అనేక ప్రాంతాల్లో రహదారులు బురద రోడ్లుగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం కారణంగా ఆచంట చినపేట ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణ అంతా వర్షపునీటితో నిండిఉంది. అలాగే కొద్దిపాటి వర్షానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ కూడా వర్షం నీటితో నిండిపోవడంతో ఆవరణం అంతా కూడా పచ్చగడ్డితో నిండితూ ఉంది. దీంతో విద్యార్థులు పలు ఇబ్బందులు పడుతున్నారు.

మొగల్తూరు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ప్రధాన రహదారులలో వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 3వ తేదీన 35 మిల్లీ మీటర్లు, 5వ తేదీన 35.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. దీంతో మొగల్తూరులోని ప్రధాన రహదారులైన గొల్లగూడెం రోడ్డు, స్టేషన్‌రోడ్డు, మండల పరిషత్ కార్యాలయాల సముదాయానికి వెళ్ళే వర్షం నీరు నిలిచిపోయింది. మొగల్తూరు గాంధీబొమ్మల సెంటర్ నుంచి వెంప వెళ్ళే పెద్ద గొల్లగూడెం ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. రెండు రోజుల వర్షానికి ఆగోతులు నీటితో నిండిపోవడం, రహదారి వెంబడి ముంపు నీరు లాగకపోవడం వంటి కారణాలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

పాలకొల్లు అర్బన్: నాలుగు రోజులుగా రాత్రివేళల్లో వర్షం కురుస్తోంది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు వార్డుల్లో డ్రెయినేజీలు పొంగి పొర్లుతున్నాయి. హౌసింగ్ బోర్డు కాలనీ, ఎల్‌ఆర్‌పేట తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి డ్రెయినేజీ నీరు, వర్షపు నీరుతో చేరడంతో ప్రజలురాక పోకలకు ఇబ్బందులు ఇబ్బందులు పడ్డారు. శనివారపు సంతకు గిరాకి తగ్గింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆకివీడు, జూలై 6: విద్యుత్ మరమ్మతులు కారణంగా ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు డీఈ అహ్మద్‌ఖాన్ శనివారం తెలిపారు. ఆకివీడుతో పాటు అజ్జమూరు, దుంపగడప, అయి-భీమవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సమన్వయంతో గ్రామాల అభివృద్ధి

పాలకోడేరు, జూలై 6: సమన్వయంతో ముందుకు వెళ్ళి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు) అన్నారు. పాలకోడేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విస్సాకోడేరు సర్పంచ్ గొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో కుక్కలబెడద ఎక్కువైపోయిందని వాటిని సమస్యను పరిష్కరించే విధంగా అధికారులు సహకరించాలని అన్నారు. అధికారులు పూర్తిస్థాయిలో రావడం లేదని సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరైనప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నరేష్, లక్ష్మీతులసి పాల్గొన్నారు.

టీబీఆర్‌లో ఎన్‌సీసీ ఎంపికలు



పెంటపాడు, జూలై 6: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని టీబీఆర్ సంస్థ అధినేత తనుబుద్ధి భోగేశ్వరరావు అన్నారు. శనివారం అలంపురం టీబీఆర్ సైనిక్ పాఠశాలలో ఏలూరు 19 ఆంధ్రా బెటాలియన్ సిబ్బంది 8వ తరగతి విద్యార్థులను ఎన్‌సీసీకి ఎంపిక చేశారు. మొత్తం 40 మంది విద్యార్థులు పాల్గొనగా 36 మంది ఎంపికైనట్టు భోగేశ్వరరావు తెలిపారు. కరస్పాండెంట్ పద్మావతి, డైరెక్టర్ రవికిరణ్, ప్రిన్సిపల్ కరుణప్రసాద్, హెచ్‌ఎం కల్యాణి, ఏవో నాగరాజు పాల్గొన్నారు.

ఫిర్యాదుపై క్షేత్రస్థాయి పరిశీలన

ఆకివీడు, జూలై 6: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో వచ్చిన ఫిర్యాదు మేర తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరీ, వ్యవసాయాధికారి ఎంఆర్వీ ప్రియాంక శనివారం పరిశీలించారు. సిద్ధాపురం సమీపంలోని కొత్తచెరువు దగ్గర అనుమతులు లేకుండా ఆక్వాచెరువు సాగు చేస్తుండడంతో తమ భూమికి ఆటంకం కల్గుతుందని రామూర్తిరాజు ఫిర్యాదు చేయడంతో పరిశీలించడం జరిగిందన్నారు. ఉన్నతాధికారులకు నివేదిక అందచేస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మావేశంలో మాట్లాడుతున్న మండలపార్టీ అధ్యక్షుడు కె.నాగరాజు

ఉండి, జూలై 6 : ఉండి గ్రామంలో సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించటానికి ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజు దృష్టికి తీసుకువెళ్తామని మండల పార్టీ అధ్యక్షుడు కరిమెర నాగరాజు అన్నారు. శనివారంనాడు ఉండి గ్రామ టీడీపీ సమావేశం కాగిత బుజ్జి అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ అబ్బాయిరాజుపార్కు అభివృద్ధి, గ్రామంలో నిలచిపోయిన పశువుల ఆసుపత్రి, డంపింగ్‌యార్డు సమస్య, డ్రెయినేజీ సమస్యలు వంటివి ఎమ్మెల్యే రఘురామరాజు దృష్టికి తీసుకువెళ్ళి వాటిపై చర్చించి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

యండగండి పీహెచ్‌సీ తనిఖీ

ఉండి,జూలై 6: అతిసార నివారణపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. శనివారం యండగండి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఆకస్మింకగా తనిఖీ చేశారు. ముందుగా పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. వైద్యులు బెన్ని శామ్యూల్, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

జీవ కోటి మనుగడకు మొక్కలు ప్రాణాధారం



మొక్కలు నాటుతున్న రోజారమణి

పాలకొల్లు అర్బన్, జూలై 6 : మొక్కలు జీవకోటి మనుగడకు ప్రాణాధారం అని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్నేన రోజా రమణి అన్నారు. ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా రోజారమణి మాట్లాడుతూ మానవ జీవితానికి ఆధారమైన ప్రాణవాయువును అందించే మొక్కలను నాటి అవి వృక్షాలుగా ఎదిగేవిధంగా మన వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీకే మల్లేశ్వరరావు, అధ్యాపకులు ఎస్‌విరావు, కె.మురళీ కృష్ణ, పి.రాజా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎఎస్ఎస్ రమణ కుమార్ పాల్గొన్నారు.









పాలకొల్లులో విద్యా కిట్లు అందిస్తున్న మంత్రి నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర.. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును కలిసిన మొయ్యేరు టీడీపీ, జనసేన నేతలు.. ఎమ్మెల్యే నాయకర్ దంపతుల్ని సన్మానిస్తున్న దృశ్యం.. మద్ది ఆలయం వద్ద ఎమ్మెల్యే బొలిశెట్టికి స్వామివారి వస్త్రాన్ని కడుతున్న అర్చకులు

టిడ్కో కాలనీని తీర్చిదిద్దుతా: మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, జూలై 6: జగన్ ఐదేళ్ల పాలనలో టిడ్కో గృహవాసులకు కనీసం వీధి లైట్లు కూడా వేయలేదనీ టిడ్కో గృహాల సముదాయాల్లో మౌలిక వసతులు కల్పించి నివాసయోగ్యంగా ఉండేలా అన్ని రకాల సదుపాయాలు కల్పించే బాధ్యత నాదని రాష్ట్ర ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడు కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు. ఇటీవల కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన వీధిలైట్లును స్విచ్ ఆన్‌చేసి శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యుత్ లైట్లు వెలుగుల్లో కాలనీ ప్రాంతమంతా కాంతివంతమవ్వడంతో టిడ్కోఇళ్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం హయాంలో టిడ్కో గృహాలను 90శాతం పూర్తిచేస్తే జగన్ ఈఐదేళ్ల పాలనలో అరబస్తా సిమెంట్ పని కూడా చేయలేదన్నారు. తాగునీటి సమస్యను మెరుగుపర్చే దిశగా ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. దట్టంగా పెరిగిన చెత్తమొక్కలతో పాటు చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆసుపత్రి, రైతుబజార్, బ్యాంకులు, ఏటీఎం వంటివి సమకూర్చుతామన్నారు. నరసాపురం కాల్వపై ఫుట్‌పాత్ వంతెనను నిర్మిస్తామని మంత్రి రామానాయుడు కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, బోనం చినబాబు, జక్కంపూడి కుమార్ పాల్గొన్నారు.

విద్యకు పేదరికం అడ్డురాకూడదు: మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, జూలై 6: విద్యకు పేదరికం అడ్డురాకూడదని, ప్రతీ పేదవిద్యార్థి బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు బీఆర్ఎంవి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం అందజేశారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచిగా, మెనూ ప్రకారం అందించాలని ఎలాంటి లోటుపాటు లేకుండా చూడాలని లేకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో 20లక్షలు ఉద్యోగాలు కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఏపీ సీపి శ్యామ్‌సుందర్, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి: ధర్మరాజు

గణపవరం, జూలై 6: గ్రామాల్లో మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు భరోసా ఇచ్చారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మొయ్యేరు టీడీపీ అధ్యక్షుడు కానుమిల్లి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఇంటూరి చంద్రమోహన రావు, టీడీపీ నాయకుడు బలుసు శ్రీనివాసరావు, సర్పంచ్ డి..కుటుంబరావు నాయకత్వంలో గ్రామ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపర్చాలి: ఆరిమిల్లి

తణుకు, జూలై 6: వైసీపీ హయాంలో పట్టణాన్ని చెత్తమయం చేశారు. ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయాయి. వార్డుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడా పరిస్థితులు మారాలి. పారిశుధ్యం మెరుగుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయమే వార్డుల్లో పారిశుధ్య పనులను, సిల్టు తొలగింపు పనులను పర్యవేక్షించారు. వైసీపీ ప్రభుత్వంలో మూడేళ్ళ నుంచి డ్రెయినేజీల్లో సిల్టు తొలగించకపోవడం వల్ల మురుగునీరు పారక దోమలు బెడద ఎక్కువైందన్నారు. చిన్నపాటి వర్షానికే రహదారులు జలమయం అవుతున్నాయన్నారు. పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్ది, ద్వారకాలో బొలిశెట్టి పూజలు

తాడేపల్లిగూడెం అర్బన్/ద్వారకా తిరుమల, జూలై 6: ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కుటుంబంతో సహా శనివారం గురువాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ద్వారకా తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందించారు. బొలిశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నాయకర్ దంపతులకు సన్మానం

నరసాపురం, జూలై 6; ఎమ్మెల్యేగా భారీ మోజార్టీతో ఎన్నికైన నాయకర్ దంపతుల్ని శనివారం రాత్రి తెలగ కళ్యాణ మండపంలో రాయల్ క్లబ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, పొత్తూరి రామరాజు, డాక్టర్ చిన్నిమిల్లి సత్యానారాయణ, మేకల సతీశ్, కోటిపల్లి వెంకటేశ్వరరావు, సురేష్ తదితరులు ఘనంగా సన్మానించారు. జక్కం శ్రీమన్నారాయణ, యర్రంశెట్టి ఫణి, గంధం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.







వ్యాధులపై బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి.. ఎమ్మెల్యే రామాంజనేయులు.. ఆకివీడు, నరసాపురంలలో కుక్కలకు వ్యాక్సిన్లు

పశు సంక్రమిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

భీమవరం టౌన్, జూలై 6: పశుసంక్రమిత వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. శనివారం ప్రపంచ పశు సంక్రమిక వ్యాధుల నివారణ దినం (ప్రపంచ జునోసిస్ దినోత్సవం) సందర్భంగా భీ మవరం పశువుల ఆసుపత్రిలో ఉచిత యాంటీ రాబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సి.నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన చుట్టూ మనతో పాటు మసలే పశు పక్ష్యాదులు జంతువుల వల్ల మేలుతో పాటు ప్రమాదం కూడా పొంచి ఉందన్నారు. పశువులు, జంతువులు, కీటకాల వల్ల సుమారు 150 కి పైగా వ్యాధులు వస్తాయన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ఈ వ్యాధుల వలన సుమారు. 60వేల వేల మంది సంవత్సరానికి మన దేశంలో మరణినిస్తునారన్నారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) మాట్లాడుతూ యజమానులు పెంపుడు జంతువులను బయటకు వదలకుండా ఇంటి వద్ద జాగ్రత్తగా ఉండేలా చూసుకోవాలన్నారు.

పాలకొల్లు అర్బన్/ రూరల్: లయన్స్ క్లబ్, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా వరల్డ్ జూనోసిస్ డే ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పశువైద్యశాల వద్ద పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కె జయభారత రెడ్డి, కార్యదర్శి అందే భాను ప్రసాద్, టీవీఆర్ సురేష్, కమిటీ చైర్మన్ ఎస్.కామేశ్వరరావు, పి రాము, విష్ణు, లయన్స్ క్లబ్ ప్రతినిధి గోటేటి ఫణిబాబా, తదితరులు పాల్గొన్నారు. పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి మల్లేశ్వరరావు, ఆధ్వర్యంలో పెంపుడు జంతువులకు వ్యాక్సిన్లు వేశారు. అనంతరం ఎంఎంకెఎన్ఎం హైస్కూల్లో విద్యార్థులకు వ్యాధులు గురించి అవగాహన కల్పించారు.

ఆకివీడు: పశుపక్షాదుల ద్వారా కూడా మానవులు రోగాలబారిన పడతారని వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్ కె.జనార్దనరావు అన్నారు. ప్రపంచ జంతు సంక్రమిత వ్యాధుల (జునోసిస్) దినం సందర్భంగా శనివారం పశువుల ఆసుపత్రిలో కుక్కలు, కోళ్ళు తదితర పశువులకు టీకాలు వేసి అవగాహన కల్పించారు. కుక్కల ద్వారా సంక్రమిస్తున్న అతి ప్రమాదకరమైన రేబిస్ వ్యాధిని టీకాల ద్వారానే అరికట్టవచ్చునన్నారు.

నరసాపురం రూరల్: పట్టణంలోని పశువైద్యశాలలో శనివారం జూనోసిస్ డేను పురస్కరించుకుని 200 పెంపుడు కుక్కలకు ఏడీ డాక్టర్ సుధాకర్ ఉచితంగా వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొని డాక్టర్ సుధాకర్‌ను సత్కరించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు: పశువుల ఆసుపత్రిలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేశారు. 84 పెంపుడు కుక్కలకు టీకాలు వేసినట్టు వైద్యాధికారిణి గొట్టుముక్కల నీలిమా తెలిపారు.

తణుకు: పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టరు డాక్టర్ పి. సూర్యచంద్రరావు అన్నారు. శనివారం జూనోసిస్ డేను పురస్కరించుకుని తణుకులోని పశువులు ఆసుపత్రి వద్ద పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేసి, అవగాహన సదస్సు నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టరు డా. ఆర్. శ్రీధర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వారాహి పూజలు



మొళ్ళపర్రులో అమ్మవారికి పూజలు

మొగల్తూరు, జూలై 6: మొళ్ళపర్రు కనకదుర్గ బీచ్‌లో దశావతార సహిత మత్స్యనారాయణస్వామి అష్టలక్ష్మీ సమేత ఆదిలక్ష్మీ అమ్మవార్ల ఆలయంలో శనివారం వేకువ జామునుంచి వారాహి పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు ప్రవీణ్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో నక్షత్ర దోషాలు, కార్యసిద్ధి, దుష్టగ్రహ నివారణకు విశేషార్చనలు నిర్వహించారు. నరసాపురం మండలం చినమైనవానిలంక నుంచి సుమారు 50 మంది భక్తులు కాలినడకన అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆకివీడు: వెంకట లింగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం వారాహి అమ్మవారి నవరాత్రుల హోమాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 17 వరకు జరుగుతాయని అర్చకులు మొవ్వా సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ హోమాలు, పూర్ణాహుతి చేయడం వలన సకల పీడలు, దోషాలు తొలగుతాయన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ టీడీపీ ఫ్లోర్ లీడర్ బొల్లా వీరశ్వేత-శేషుబాబు, కౌన్సిలర్ నిమ్మల నాగు, గోడవర్తి మణికంఠ పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



పూజుల చేస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు కుమారుడు భరత్

భీమవరం టౌన్, జూలై 6: ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు శనివారం మారుతి టాకీస్ రోడ్డులోని దాసాంజనేయ స్వామికి 1,116 కొబ్బరి కాయ లు కొట్టి అభిషే కాలు, పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు కుమారుడు భారత్ చే స్వామి వారికి తమలపాకులు, సింధూర ంలతో సహస్ర నామ పూజలను నిర్వహించారు. అనంతరం 1116 కొబ్బరి కాయ లతో ప్రత్యేక అలంకరణ చేశారు.



నూతన క్లబ్ సభ్యులతో ఎమ్మెల్యే ఆరిమిల్లి

ప్రతి ఒక్కరూ సేవాభావంతో ఉండాలి: ఆరిమిల్లి

తణుకు, జూలై 6: సమాజ సేవ చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం రాత్రి రోటరీ క్లబ్‌లో నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడారు. క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాసు మాట్లాడుతూ క్లబ్ సభ్యులు రోటరీ ద్వారా సేవలందించడం అదృష్టంగా బావించాలన్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఆనందం మస్తాన్‌రావు, కఠారి సిద్ధార్థతో పాటు పలువురు సభ్యులతో ప్రమాణం చేయించారు. దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ ఎం. దినేష్‌కుమార్, బసవా రామకృష్ణ, కలగర వెంకటకృష్ణ, గమిని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనకు సహకరించాలి

అత్తిలి, జూలై 6 : డయేరియా నిర్మూలనలో డ్వాక్రా సంఘాలు సహకరించాలని అత్తిలి పీహెచ్‌సీ వైద్యుడు కె. నాగరాజు, మంచిలి వైద్యుడు కిరణ్ కోరారు. అత్తిలిలో జరిగిన మండల డ్వాక్రా సమాఖ్య సమావేశంలో మాట్లాడారు. చిన్నారులకు డయేరియా సోకితే వెంటనే ఆరోగ్య కేంద్రానికి తీసుకుని రావాలని, ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ సిరప్ అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని కోరారు.

జగ్జీవన్‌రామ్ ఆశయాలు సాధించాలి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసిన టీడీపీ కన్వీనర్ వలవల బాబ్జి

గణపవరం, జూలై 6 : భారత మాజీ ఉపప్రధాని, సంఘ సంస్కర్త బాబూజగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు కోరారు. శనివారం పిప్పరలోని పార్టీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అడ్డేపల్లి వాసురాజు, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, నాయకులు దండు బాబ్జీరాజు, ఇందుకూరి మారిరాజు, మాజీ సర్పంచ్ కొప్పిశెట్టి ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆచంట: స్వాతంత్ర్య సమరయోధుడు, దళిత ఆశా జ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి దంపతులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కందరవల్లి సర్పంచ్ బోడపాటి బుల్లియ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలన్న బాబూ జగ్జీవన్‌రాం ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని యాగర్లపల్లి ఫ్లై ఓవర్ వద్ద జగ్జీవన్‌రాం విగ్రహాన్ని శనివారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, వర్తనపల్లి కాశి, పైబోయిన వెంకట్రామయ్య, నరిసే సోమేశ్వరరావు, గుండుమోగుల సురేష్, చాపల రమేష్ పాల్గొన్నారు.

పెంటపాడు: పెంటపాడు కూనాకారపేట వద్ద ఉన్న జగ్జీవన్‌రాం విగ్రహానికి టీడీపీ దళిత విభాగం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చెప్పుల వాసు పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ దళిత నాయకులు గెద్దాడ రాజు, అద్దంకి వెంకటేశ్వర్లు, మెరిపో నాగరాజు తదితరులు పాల్గొన్నారు. బిళ్ళగుంటలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పించారు.

పాలకొల్లు అర్బన్: ఎంపీఆర్‌పి ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బొమ్మల సెంటర్‌లో జగ్జీవన్‌రాం విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసా థియేటర్ రోడ్డులో కరెంట్ ఆఫీస్ వద్ద జగ్జీవన్ విగ్రహానికి పూల మాలలు వేశారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు యడ్ల శివాజీ, కొలుకులూరి అర్జున రావు, బోణం వెంకట్రావు, షేక్ మహబూబ్ బాషా (జానీ), బెన్నీపాల్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: పేద, బడుగు వర్గాల కోసం బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి కొనియాడారు. శనివారం టీడీపీ పార్టీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, ముత్యాల సత్యనారాయణ, సర్పంచ్ పీతల సత్యనారాయణ, దాసి విద్యాసాగర్, మార్లపూడి మహేష్ పాల్గొన్నారు.

అతిసారపై అవగాహన ర్యాలీ

ఆకివీడు, జూలై 6: దుంపగడప తిమ్మరాజు కాలనీలో బాలింతలు, అంగన్‌వాడీ స్కూల్ పిల్లలకు అతిసార వ్యాధి లక్షణాలు, జాగ్రత్తలు ఏఎన్ఎం నాగలక్ష్మి శనివారం వివరించారు. చేతులు శుభ్రత, ఓఆర్ఎస్, జింక్ మాత్రల ప్రాముఖ్యత, తల్లిపాల విశిష్టత, వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రత తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు.

హాస్టల్స్‌లో సౌకర్యాలు కల్పించాలి

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 6 : విద్యార్థులు ఉన్నతంగా విద్యను అభ్యసించేందుకు అనువైన వాతావరణాన్ని వసతి గృహాల్లో కల్పించాలని జిల్లా కలెక్టర్ సి నాగరాణి అన్నారు. గునుపూడిలోని బీసీ ప్రీమెట్రిక్, ఎస్సీ ప్రీమెట్రిక్, ఎస్సీ గరల్స్ కాలేజీ హాస్టల్ క్యాంపస్‌ను, శివరావుపేటలో ఎస్సీ కాలేజ్ బాయ్స్ హాస్టల్‌ను శనివారం నాడు జిల్లా కలెక్టర్ నాగరాణి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వసతి గృహాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, భోజన వసతిపై ఆరా తీశారు. విద్యార్థినులను పలు ప్రశ్నలు అడిగి జిల్లా కలెక్టర్ సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల రూమ్స్, వారు ఉపయోగించే టాయిలెట్స్ పరిశీలించారు.

ధరల నియంత్రణకు వర్తకులు సహకరించాలి

భీమవరం టౌన్, జూలై 6 : బహిరంగ మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణకు వర్తకులు సహకారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య కోరారు. శనివారం కలెక్టరేట్‌లో రిటైల్ అమ్మకందారులతో సమావేశమై మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరల స్థిరీకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉల్లిపాయలు, కూరగాయలతో పాటు పప్పులు, బియ్యం, ఆయిల్ వంటి ధరలు అందుబాటులో లేని విధంగా రోజు రోజుకు ధరలు పెరిగిపోతున్నాయన్నారు. వర్తకులు వారి వద్ద ఉన్న స్టాక్స్‌ని వెంటనే భారత ప్రభుత్వం వారి వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి

భీమవరం టౌన్, జూలై 6 :దేశ సమైక్యత కోసం, అఖండ భారతదేశాన్ని విశ్వ గురువుగా నిలపాలని పరితపించిన మహనీయుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అని పలువురు వక్తలు అన్నారు. భీమవరంలోని బీజేపీ కార్యాలయంలో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. బీజేపీ నాయకులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, కాగిత సురేంద్ర, పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేసిన లారీ యజమానులు



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 6: తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో ఏళ్ల తరబడి గోతుల రహదారితో ప్రజలు ఇబ్బంది పడుతుండడంతో గ్రామానికి చెందిన కోట్లమ్మ తల్లి సింగిల్ లారీ ఓనర్, వర్కర్స్ సంఘం నాయకులు రోడ్డు నిర్మించారు. గ్రామానికి చెందిన కూటమి నాయకులంతా కలిసి గ్రామంలోని రిటైర్డ్ స్టేషన్ మాస్టర్ ఉప్పలపాటి సత్యనారాయణ సహకారంతో యూనియన్ సభ్యులు ఉచితంగా లారీలు, మిషన్‌లు సమకూర్చి 3 కిలోమీటర్ల మేర రోడ్డును నిర్మించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపున ఒదుకున్న కూటమి నాయకులు ఈ రోడ్డు నిర్మాణానికి సహకారం అందించారు.

తాగునీరు, పారిశుధ్యానికి పెద్దపీట వేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 6: గ్రామాల్లో తాగునీటికి, పారిశుధ్యానికి పెద్దపీట వేయాలని ఎంపీడీవో శర్మ సూచించారు. జగన్నాథపురం, మారంపల్లి గ్రామాల్లో శనివారం మండల స్థాయి అధికారులతో పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల సత్యనారాయణ గ్రామంలో మంచినీటి నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరగా ముందుగా మంచినీటి చెరువు నీటిని పరీక్షించారు. సర్పంచ్ చంద్రిక, ఈవోపీఆర్డీ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గన్నపేటలో ఏరువాక

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 6: తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేటలో ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గొర్రెల శ్రీధర్ తన వ్యవసాయ క్షేత్రంలో వరినాట్లు వేసి కార్యక్రమం ప్రారంభించి మాట్లాడుతూ రైతులంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.